సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



బీసీ వర్గీకరణ చేపట్టాలి

బీసీల్లోని వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు అందాలంటే వర్గీకరణ చేపట్టాలని తమ్మినేని వీరభద్రం కోరారు. - 8లో



సమస్యల పరిష్కారానికి కృషి

రవాణా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో



పోలీసులపై చర్య తీసుకోవాలి

దళిత మహిళను దారుణంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ నాయకులు ధర్నా చేశారు. - 9లో

న్యూస్‌రీల్

డీఆర్‌డీఓగా నాగిరెడ్డి

సాక్షి, యాదాద్రి : జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి(డీఆర్‌డీఓ)గా టి.నాగిరెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు డీఆర్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న కృష్ణన్‌ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాగిరెడ్డి గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీఆర్‌డీఓగా పనిచేస్తూ.. ఎన్నికల బదిలీల్లో భాగంగా నల్లగొండకు బదిలీపై వెళ్లారు. రెండు రోజుల్లో ఆయన విధుల్లో చేరనున్నారు.

'నేతన్న బీమా'కు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : నేతన్న బీమా పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎండీ కామిల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత, మరమగ్గాలు, అనుబంధ కార్మికులు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న చేనేత కార్మికులు పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. పథకంలో నమోదైన కార్మికులు ఏదైనా కారణంతో మరణిస్తే బీమా కింద బాధిత కుటుంబానికి రూ. 5లక్షలు వస్తాయన్నారు. దరఖాస్తులను చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న యువజన క్రీడల అభివృద్ధి అధికారి


భువనగిరి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా యువజన క్రీడల సర్వీస్ అధికారి ధనుంజయనేయులు సూచించారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్ర స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికైన ఎస్.దీక్షిత, మణికుమార్, భానుప్రసాద్, యశ్వంత్‌ను సోమవారం జిల్లా యువజనక్రీడల శాఖ కార్యాలయంలో అభినందించారు. వారికి ఎంపిక ధ్రువీకరణ పత్రాలు అందజేసి మాట్లాడారు. క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



శివాలయంలో స్ఫటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. కొండపైన ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ప్రధానాలయంలో వేకువజామున సుప్రభాత సేవ చేపట్టి స్వయంభూలకు అభిషేకం, తులసీఅర్చన చేశారు. అనంతరం ప్రాకారమండపంలో శ్రీసుదర్శన నారసింహహోం, నిత్యకల్యాణం, వేద ఆశీర్వచనం, జోడ సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. నిత్యకల్యాణం, వేద ఆశీర్వచనం, సువర్ణపుష్పార్చనలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.



సోమవారం రాత్రి 20 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

కృష్ణమ్మ గలగలలు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 20 గేట్ల గుండా పరవళ్లు


- 585 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం
- 2,24,971 క్యూసెక్కులు దిగువకు విడుదల

- సోమవారం ఉదయం 11.45 గంటలకు గేట్లు ఎత్తిన అధికారులు
- తొలుత ఆరు.. మధ్యాహ్నం 12.. సాయంత్రం 16.. రాత్రి పది గంటలకు 20 గేట్లు ఎత్తివేత
- శ్రీశైలం జలాశయం నుంచి 2,76,203 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కృష్ణమ్మ అందాలు చూసి పరవశించిపోతున్న పర్యాటకులు

నాగార్జునసాగర్: సాగర్ వద్ద 20 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువగల శ్రీశైలం జలాశయం నుంచి 2,76,203 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 582.90అడుగులకు(291.3895టీఎంసీలు) చేరగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 11:45 గంటలకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నాగేశ్వర్‌రావు 13వ గేటు స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. కృష్ణమ్మకు పూజలు చేశారు. ముందుగా 6గేట్లు, అనంతరం 10గేట్లు ఎత్తారు. సాయంత్రం నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతులమీదుగా 4గేట్లు ఎత్తి కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. ఆరు గంటలకు మరో రెండు గేట్లు ఎత్తారు. మొత్తం 16గేట్లు ఐదు అడుగులపైకి ఎత్తారు. వరద ఎగువ నుంచి పెరగడంతో రాత్రి 10గంటలకు మరో నాలుగు.. మొత్తం 20 గేట్లు ఎత్తారు. స్పిల్‌వే మీదుగా 1,96,064 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదన ద్వారా మరో 28,907 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. మొత్తంగా దిగువ నదిలోకి 2,24,971 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణానదిలోకి విడుదలవుతోంది. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థ్యం 312.5050 టీఎంసీలు.

పర్యాటకుల సందడి

రెండేళ్ల తర్వాత సాగర్ గేట్లు ఎత్తడంతో ముందుగానే మీడియా ద్వారా తెలుసుకున్న పర్యాటకులు కృష్ణమ్మ పరవళ్లు వీక్షించేందుకు తరలివచ్చారు. కృష్ణమ్మ.. స్పిల్‌వేమీదుగా దిగువకు దుముకుతున్న సుందర దృశ్యం తమ సెల్‌ఫోన్లలో బంధించారు. ఎండ మెండుగా ఉండటంతో బత్తాయిరసం విక్రయించే తోపుడు బండ్లు కృష్ణాతీరంలో వెలిశాయి.



హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

నాలుగు గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల

హుజూర్‌నగర్ : సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో కృష్ణానదిపై గల పులిచింతల ప్రాజెక్టు నుంచి సోమవారం నీటి విడుదల ప్రారంభమైంది. కృష్ణాడెల్టాలో ఆయకట్టుకు నీరు అవసర పడటంతో అధికారులు పులిచింతల ప్రాజెక్టు 24గేట్లకు గాను నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఒక గేటును 2.5 మీటర్లు, మూడు గేట్లను రెండు మీటర్లు ఎత్తి 26,083 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ఎగువన ఉన్న నాగార్జుసాగర్ ప్రాజెక్టునుంచి 67,112 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పులిచింతలకు వస్తోంది. పులిచింతల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.10 టీఎంసీల నీరు ఉంది. నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 40.20 మీటర్లు ఉంది. ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో గంటగంటకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం టీఎస్ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



సాగర్‌లో క్రస్ట్ గేట్లు ఎత్తేందుకు స్విచ్ ఆన్ చేస్తున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



టెయిల్‌పాండ్ నుంచి విడుదలవుతున్న నీరు

టెయిల్‌పాండ్ దిగువకు నీటి విడుదల

అడవిదేవులపల్లి : నాగార్జునసాగర్ జలాశయం నుంచి టెయిల్‌పాండ్‌కు సోమవారం మధ్యాహ్నం 1,32,794 క్యూసెక్కుల నీరు చేరుతుండడంతో టెయిల్‌పాండ్ గేట్లెత్తి 1,32,411 క్యూసెక్కుల నీటిని దిగువగకు విడుదల చేస్తున్నారు. టెయిల్‌పాండ్ దిగువ ప్రాంతాలైన చిట్యాల, అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాలర్లు వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ సురేష్‌కుమార్ సూచించారు. ఆయన వెంట ఆర్ఐ శ్యాం సుందర్ ఉన్నారు.

స్వచ్ఛదనంలో భాగస్వాములుకండి



'స్వచ్ఛదనం - పచ్చదనం' ర్యాలీలోఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే. జెండగే తదితరులు

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే. జెండగే

భువనగిరి : 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని కిసాన్‌నగర్‌లో సోమవారం రాష్ట్ర మైన్స్, జియాలజీ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. భువనగిరి మున్సిపాలిటీలో 2లక్షల మొక్కలు నాటాలని నిర్దేశించామని, 9వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. భువనగిరి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని, త్వరలో సీఎంను కలిసి రూ.100 కోట్లు మంజూరు చేయాలని కోరనున్నట్లు వెల్లడించారు. మైన్స్, జియాలజీ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ.. అందరూ స్వచ్ఛందంగా పాల్గొంటేనే స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

శంకుస్థాపన..

అమృత్ 2.0 పథకం కింద రూ. 21.80 కోట్లతో ప్రగతినగర్, సింగన్నగూడెం, రాయగిరికి వాటర్ సప్లై, జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఐసీయూ బ్లాక్ పనులకు శంకుస్థాపన చేశారు. 80 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ అమరేందర్, మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ, కౌన్సిలర్ అవంతిక క్రాంతి, డీఎఫ్ఓ పద్మజారాణి,డీఎంహెచ్ఓ డా.మనోహర్, కాంగ్రెస్ భువనగిరి అధ్యక్షుడు కూర వెంకటేష్, నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, సత్యనారాయణ, అవెజ్‌చిస్తీ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రెండో జత ఇంకెప్పుడు!

- విద్యార్థులకు మలి విడత యూనిఫాం పంపిణీలో జాప్యం
- ఒక్క జతతోనే పాఠశాలకు హాజరు
- పంద్రాగస్టు లోపు అందజేస్తామంటున్న అధికారులు



భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా విద్యాసంవత్సరం పునఃప్రారంభం సమయంలో రెండుజతల యూనిఫాం అందజేయాలనే నిబంధన ఉంది. కానీ, ఒక్క జత మాత్రమే ఇవ్వడంతో కొందరు విద్యార్థులు రోజూ అదే యూనిఫాంను వాష్ చేసుకుని పాఠశాలకు హాజరవుతున్నారు. మరికొందరు గత ఏడాది ఇచ్చిన యూనిఫాం ధరించి వెళ్తున్నారు. పంద్రాగస్టు సమీపిస్తున్నా విద్యార్థులందరికీ రెండో జత యూనిఫాం అందలేదు.

వస్త్రం ఆలస్యంతోనే..

జూన్ రెండోవారంలోనే విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందజేయాలి. కానీ, జిల్లాకు పూర్తిస్థాయిలో వస్త్రం రాకపోవడం, అదికూడా ఆలస్యం కావడంతో తొలుత ఒక జత అందజేశారు. రెండో జత గత నెల 25వ తేదీ నాటికి పంపిణీ చేయాల్సి ఉంది. కానీ, దీనికి సంబంధించిన వస్త్రం కూడా ఆలస్యంగా రావడం, కుట్టడం పూర్తికాకపోవడంతో నిర్ణీత గడువులోపు విద్యార్థులందరికీ రెండో జత అందలేదు. ఈనెల 15 వరకైనా పంపిణీ చేయాలని విద్యాశాఖ అధికారులు భావించగా చాలా చోట్ల కుట్టు మిషన్లపైనే యూనిఫాం వస్త్రం ఉంది.

47,262 మంది విద్యార్థులు

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలు 712 ఉన్నాయి. వీటిలో మొత్తం 47,262 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా 50 రోజులుగా ఒకే జత యూనిఫాంతో పాఠశాలకు వెళ్తున్నారు.

యూనిఫాం కుట్టు చార్జి జతకు రూ.50

విద్యార్థుల యూనిఫాం కుట్టు బాధ్యతలను ఈవిద్యా సంవత్సరం మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. జతకు రూ.75ల చొప్పున కుట్టు చార్జి చెల్లిస్తామని ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రకటించింది. కానీ, మొదటి విడతలో జతకు రూ.50వేల చొప్పున చార్జీలు విడుదల చేసింది. 47,262 మంది విద్యార్థులకు రూ.9,45,240లు వచ్చాయి. ఇంకా జతకు రూ.25చొప్పున రావాల్సి ఉంది.

10వ తేదీలోపు పంపిణీ చేస్తాం

80 శాతం మంది విద్యార్థులకు రెండో జత యూనిఫాం అందజేశాం. వస్త్రం ఆలస్యంగా రావడం, కుట్టడం కూడా జాప్యం జరగడంతో గడువులోపు పంపిణీ చేయలేకపోయాం. ఈనెల 10వ తేదీలోపు వంద శాతం మంది విద్యార్థులకు యూనిఫాం అందజేస్తాం.

– ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ

ఒక్క రోజే 600 ఓపీ



భువనగిరి : సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు జ్వరబాధితులు రెట్టింపయ్యారు. జ్వరంతో పాటు జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. దీంతో కొద్ది రోజులుగా జిల్లా కేంద్ర ఆస్పత్రికి రోగులు క్యూ కడుతున్నారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు ఆస్పత్రికి తరలివచ్చారు. పేర్లు నమోదు చేసుకునేందుకు ఓపీ కౌంటర్ల వద్ద బారులుదీరారు. ఒక్క రోజే సుమారు 600 వరకు ఓపీ నమోదైనట్లు సిబ్బంది తెలిపారు.

ప్రజావాణిలో వినతుల వెల్లువ

- వివిధ సమస్యలపై 90 అర్జీలు

భువనగిరి : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి.వివిధ సమస్యలపై 90కి పైగా వినతులు అందాయి. కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్‌మోహన్ ప్రసాద్, జిల్లా అధికారులు పార్థసింహారెడ్డి తదితరులు ప్రజల సమస్యలు ఆలకించి అర్జీలను స్వీకరించారు. అత్యధికంగా భూ సమస్యలపై 59 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖలకు రెఫర్ చేశారు.

ఉన్నతాధికారులు లేక ఇబ్బందులు

సమస్యలు వివరించాలని ప్రజావాణికి వచ్చిన ప్రజలు.. ఉన్నతాధికారులు లేకపోవడంతో నిరాశకు లోనయ్యారు. వినతిపత్రాలు అందజేసేందుకు గంటల తరబడి వే చూశారు. ఉన్నతాధికారులంతా స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ఉన్నారని తెలుసుకుని కలెక్టరేట్ ఏఓ, సూపరింటెండెంట్‌కు అర్జీలు అందజేసి వెళ్లారు.

ఆస్తికోసం కుమారుడు హింసిస్తున్నాడని..



ప్రజావాణికి వచ్చిన వడిశర్ల అయిలమ్మ

ఆస్తి కోసం తన కుమారుడు, అతని భార్య మానసికంగా హింసకు గురి చేస్తున్నారంటూ భువనగిరి పట్టణంలోని ఆజాద్ రోడ్డు ఏరియాకు చెందిన వడిశర్ల అయిలమ్మ ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసింది. తనకు నలుగురు కుమారులు ఉన్నారని, వారిలో ముగ్గురు తన యోగక్షేమాలు మంచిగానే చూసుకుంటున్నారని, రెండో కుమారుడు యాదయ్య దంపతులు ఆస్తికోసం ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

చౌటుప్పల్‌ను అగ్రగామిగా నిలుపుతా : రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతానని, హైదరాబాద్ నగరంతో సమానంగా మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలో వలిగొండ రోడ్డు విస్తరణ, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బీసీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛదనం – పచ్చదనంలో కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చౌటుప్పల్ పట్టణం హైదరాబాద్‌కు కూతవేటు దూరంలోనే ఉన్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. రానున్న రోజుల్లో చౌటుప్పల్ ప్రాంతాన్ని అన్ని విధాలా ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. ప్రధాన రహదారులు, డ్రెయినేజీలు, తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పట్టణవాసులకు ఇబ్బందికరంగా మారిన పారిశుద్ధ్య సమస్యను సైతం పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో రాష్ట్ర ప్రభుత్వమే మునుగోడుకు వచ్చినట్టుగా.. ప్రస్తుత సర్కార్ కూడా అభివృద్ధి విషయంలో చౌటుప్పల్‌ను చూడాల్సి ఉందన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడాలని, ఆ తరువాత రాజకీయాలకు అతీతంగా అందరూ అభివృద్ధిలో కలిసిరావాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, తాడూరి వెంకట్‌రెడ్డి, గుత్తా ఉమాదేవి, తహసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, డీఈ మనోహర్, ఏఈ వినిల్‌కుమార్, కౌన్సిలర్లు బండమీది మల్లేష్, కొయ్యడ సైదులు, కొరగోని లింగస్వామి, దండ హిమబిందు, బొడిగె అరుణ, సుల్తాన్‌రాజు, పిల్లల మర్రి శ్రీనివాస్, పబ్బు రాజుగౌడ్, పాశం సంజయ్‌బాబు, ఉప్పు భద్రయ్య, చెన్నగోని అంజయ్య, ఉబ్బువెంకటయ్య, ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహ్మ, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, గుండు మల్లయ్య, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, సుర్కంటి నవీన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మొక్క నాటి నీళ్లుపోస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

1.4 టీఎంసీలతో గంధమల్ల రిజర్వాయర్

- ముంపు సమస్య రాకుండా నిర్మాణం
- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట : గంధమల్ల రిజర్వాయర్‌ను 1.4 టీఎంసీలతో నిర్మాణం చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వెల్లడించారు. తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువును సోమవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముంపు సమస్య రాకుండా రిజర్వాయర్ నిర్మాణం చేపడతామన్నారు. గంధమల్ల విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలయాపన చేసిందే తప్పా.. తట్టెడు మట్టి ఎత్తిపోయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో రిజర్వాయర్ నిర్మించి ఎక్కువ ఆయకట్టును సాగులోకి తీసుకువచ్చేలా రూపకల్పన చేస్తుందని చెప్పారు. తపాసుపల్లి, నవాబుపేట రిజర్వాయర్ల నుంచి సాగునీరు అందిస్తామన్నారు.పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కారంతో అందజేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను అయిలయ్య తప్పుపట్టారు. నాణ్యమైన భోజనం అందజేస్తున్నామని వెల్లడించారు. అనంతరం 'స్వచ్ఛదనం -పచ్చదనం' ర్యాలీలో పాల్గొని మొక్కలు నాటారు.



గంధమల్ల చెరువును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బీబీనగర్: మండలంలోని పడమటిసోమారం గ్రామ పరిధిలో గల కేఎస్ఎస్ వెంచర్‌లో ఆదివారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని మల్లాపూర్ పరిధిలో గల అశోక్‌నగర్‌కు చెందిన బొంత ముత్యాలు(60) బీబీనగర్ మండలం పడమటిసోమారం పరిధిలోని కేఎస్ఎస్ వెంచర్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటూ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన ముత్యాలు వెంచర్‌లోని వాటర్‌ట్యాంక్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ముత్యాలు తిరిగి ఇంట్లోకి రాకపోవడంతో అతడి భార్య నాగమ్మ బయటకు వెళ్లి చూడగా ముత్యాలు విగతజీవిగా ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులు చేసి ఉడాయించిన నిందితుల రిమాండ్


వలిగొండ: అధిక వడ్డీ ఆశ చూపి పెద్ద మొత్తంలో అప్పులు చేసి పారిపోయిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం గొల్నేపల్లికి చెందిన కొర్లపల్లి వెంకటేశ్వర్లు, కొర్లపల్లి ప్రశాంత్, కొర్లపల్లి అనిల్‌కుమార్ అన్నదమ్ములు. వెంకటేశ్వర్లు, ప్రశాంత్ గ్రామంలో వేర్వేరుగా కిరాణా దుకాణాలు నడిపిస్తున్నారు. అనిల్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వీరు ముగ్గురూ కలిసి కిరాణ దుకాణాల పెట్టుబడి కోసం గ్రామస్తులకు అధిక వడ్డీ ఆశచూపి సుమారు రూ.1.50 కోట్లు అప్పులు చేసి ఊరు వదిలి పారిపోయారు. అప్పులిచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఊరు వదిలి పారిపోయిన ముగ్గురి నిందితుల జాడ తెలుసుకున్న పోలీసులు సోమవారం వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సూర్యాపేటటౌన్: మానసిక్థితి సరిగ్గా లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. పట్టణ పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం పిన్నాయిపాలెం గ్రామానికి చెందిన ఉప్పల మురళి(26)కి కొంతకాలంగా మానసిక్థితి సరిగ్గా ఉండటం లేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడికి హైద్రాబాద్‌లో చికిత్స చేయించారు. అయినప్పటికీ అతడిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన మురళి సోమవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరి జిల్లా కేంద్రంలోని చింతల చెర్వు కట్ట సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

నకిరేకల్: మండలంలోని నోముల గ్రామానికి చెందిన యల్మకంటి రజిత ఈ నెల 2వ తేదీన ఆత్మహత్య చేసుకోగా.. సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీఐ రాజశేఖర్ తెలిపారు. నోముల గ్రామానికే చెందిన టేకుల రాజేష్ వేధింపులకు గురిచేయడంతోనే తన ఆత్మహత్యకు పాల్పడిందని సోమవారం మృతురాలి భర్త శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.



సాయంకాలం.. సాగర్ సోయగం : నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు



కళకళ జలకళ : నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిసరాలు



కృష్ణమ్మకు పూజలు : నీటిని విడుదల చేసి పూలు చల్లుతున్న ఎన్ఎస్‌పీ అధికారులు



ఎన్నాళ్లకెన్నాళ్లకు.. : సాగర్ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు



బారులుదీరిన పర్యాటకుల వాహనాలు



ఇక ఫుల్లు గిరాకీ : నీటి విడుదలను చూస్తున్న జ్యూస్ అమ్ముకునే మహిళ



అదిగో జలపాతం : చిన్నారికి ఎత్తిపోతల జలపాతంను చూపిస్తున్న తల్లి



నిండు కుండ : నీటితో కళకళలాడుతున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు



గుర్తుండిపోవాలి : సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

ఫొటోలు: సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

హాస్టల్ కేటాయించొద్దని ఆందోళన

- మాడ్గులపల్లి కేజీబీవీ విద్యార్థినులను వేములపల్లి ఆదర్శ పాఠశాలకు తరలించిన అధికారులు
- ఎక్కువ మంది ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయని ఆదర్శ పాఠశాల విద్యార్థుల నిరసన



వేములపల్లి ఆదర్శ పాఠశాల ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

వేములపల్లి: మాడ్గులపల్లి కేజీబీవీకి చెందిన సుమారు 80మంది విద్యార్థినులను సోమవారం వేములపల్లిలోని ఆదర్శ పాఠశాలకు తరలించడంతో ఆదర్శ పాఠశాల విద్యార్థినులు హాస్టల్ ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. కేజీబీవీకి విద్యార్థినులను తమ హాస్టల్ ప్రాంగణానికి తరలిస్తే ఒక్కో గదిలో 30 నుంచి 35మంది ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు వాపోతున్నారు. కాలకృత్యాలు, స్నానాలు చేసి తరగతులకు వెళ్లాలంటే ఆలస్యమవుతుందని, ఇరుకు గదుల్లో అధిక మంది ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేజీబీవీ విద్యార్థినులను వేరో చోటుకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అక్కడికి చేరుకున్న జీసీడీఓ సరిత, ఎంఈఓ బాలాజీనాయక్ మాట్లాడుతూ.. రెండు పాఠశాలల విద్యార్థినులకు సమస్యలు తలెత్తకుండా చూస్తామని, ఆగస్టు 15 తర్వాత కేజీబీవీ విద్యార్థినులను వేరే చోటుకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఆందోళన విరమించారు.

ఇబ్బందులకు గురి చేయడం సరికాదు..

తాము గతంలో శెట్టిపాలెంలో ఉండగా.. తిప్పర్తికి మార్చారని తిరిగి అక్కడ సమస్య ఎదురైతే వేములపల్లి ఆదర్శ పాఠశాలకు మార్చారని, ఇలా ఎన్నిసార్లు తమను మార్చి ఇబ్బందులకు గురి చేస్తారని మాడ్గులపల్లి కేజీబీవీ విద్యార్థినులు వాపోతున్నారు. ఇక్కడ మమ్మల్ని పదిరోజుల పాటు ఉంచి మళ్లీ ఎక్కడికి పంపిస్తారో అర్థంకావడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో తాము చదువు కొనసాగించలేమని, తమను ఇంటికి పంపించి ప్రత్యామ్నాయ భవనం చూసాకే పాఠశాలకు రప్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

బీసీ వర్గీకరణ కూడా చేపట్టాలి

- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, పక్కన జూలకంటి రంగారెడ్డి తదితరులు

సూర్యాపేట: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, బీసీల్లోనూ అత్యంత వెనుకబడిన వర్గాలు ఉన్నందున వారందరికీ రిజర్వేషన్లు అందాలంటే బీసీ వర్గీకరణ కూడా చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే జీఓలు వచ్చాయని, తదనంతరం ఎన్నో పోరాటాల ఫలితంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో మరింత వెనుకబడిన కులాలకు కోటాలు ఇచ్చుకోవడానికి అనుమతించడం సానుకూలమైన అంశమని అన్నారు. వర్గీకరణ అమలులోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసివచ్చే పార్టీలను కలుపుకొని ఎక్కువ స్థానాల్లో గెలిచేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రుణమాఫీ విషయంలో షరతులు లేకుండా రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కొన్ని జిల్లాల్లో రుణం తీసుకున్న వ్యక్తి చనిపోతే రుణమాఫీ కావడం లేదన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న లిఫ్టుల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నప్పటికీ కొన్ని హామీలు మాత్రమే అమలు చేసిందని, మిగతా హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం వెంటనే రైతు భరోసా విడుదల చేయాలని కోరారు. కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను నివారించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నగరపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

రవాణా రంగం సమస్యల పరిష్కారానికి కృషి

- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడరూరల్: రవాణా రంగంలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో నిర్వహించిన కోదాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ స్వర్ణోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో రవాణా రంగంది కీలకపాత్ర అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని, పాత లారీలకు గ్రీన్ ట్యాక్స్ తగ్గించడంతో పాటు రాష్ట్రానికి చెందిన వేల లారీలు ఎక్కువగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరుకు రవాణా చేస్తుంటాయని వాటికి కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు జారీ చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాక యజమానులకు డబ్బు ఆదా అవుతుందని మంత్రి దృష్టికి ఆలిండియా లారీ అసోసియేషన్ సభ్యులు తీసుకెళ్లారు. అదే విధంగా పెరిగిన ఇన్సూరెన్స్‌లు, డీజిల్ ధరలతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. లారీ యజమానుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఆలిండియా మోటార్స్ ట్రాన్స్‌పోర్ట్ చైర్మన్ షణ్ముగప్ప, సౌత్ ఇండియా మోటార్స్ ట్రాన్స్‌పోర్ట్ వైస్ ప్రెసిడెంట్ అరవింద్ అప్పాజీ, ఏపీ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌నాయుడు, తెలంగాణ ప్రెసిడెంట్ అంజిరెడ్డి, రామినేని శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, తూనం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి యువకుడు మృతి



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి యువకుడు మృతిచెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన మల్లేపల్లి రాంరెడ్డి-విజయలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి(37) జేసీబీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గ్రామంలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా.. కల్వర్టు వద్ద బైక్ అదుపుతప్పడంతో గుంతలో పడిపోయాడు. శ్రీకాంత్ తలకు తగలడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సోమవారం ఉదయం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ తెలిపారు

చికిత్స పొందుతూ యువకుడు మృతి



కుమారస్వామి (ఫైల్)

గుండాల: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. గుండాల మండలం వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి సైదమ్మ, వెంకటయ్య దంపతుల రెండో కుమారుడు చిప్పలపల్లి కుమారస్వామి(22) మోత్కూరు పట్టణంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు వెళ్లి మెకానిక్‌గా పనిచేస్తానని కుమారస్వామి ఇటీవల తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వద్దని చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన కుమారస్వామి ఈ నెల 3వ తేదీ రాత్రి సమయంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. తాను పురుగుల మందు తాగానని తల్లిదండ్రులకు చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిట్లు ఎస్ఐ జి. సైదులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో.. ఒకరు మృతి



తావు (ఫైల్)

కొండమల్లేపల్లి: కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి చెందాడు. కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం బాలాజీనగర్ గ్రామానికి చెందిన మేగావత్ తావు(55) కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో పక్షవాతంతో ఆయనకు ఒక చెయ్యి మాత్రమే పనిచేస్తుంది. ఆ ఒక్క చేతితోనే ఆటో కూడా నడుపుతుంటాడు. సోమవారం ఉదయం కిరాణ సామాను కోసం ఆటో నడుపుకుంటూ కొండమల్లేపల్లికి వస్తుండగా చౌరస్తా వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తావు తలకు తీవ్ర గాయం కాగా.. స్థానికులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

నాంపల్లి: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని సోమవారం నాంపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం రేఖ్యాతండాకు చెందిన రమావత్ సుధాకర్ బెల్ట్ దుకాణం నిర్వహిస్తూ.. ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అతడి ఇంటిపై దాడి చేసి రూ.20వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 104 అంబులెన్స్ డ్రైవర్ దుర్మరణం



శ్రీనివాస్(ఫైల్)

అర్వపల్లి: బైక్‌పై వెళ్తూ రోడ్డు క్రాస్ చేస్తున్న 104 అంబులెన్స్ డ్రైవర్‌ను కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్(45) కొంతకాలంగా తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో 104 అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అర్వపల్లిలోని దేవాలయం రోడ్డుకు బైక్‌పై వెళ్లి తిరిగి తన ఇంటివైపు వెళ్తూ సూర్యాపేట-జనగామ 365బీ జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా.. విజయవాడ నుంచి జనగామ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ కారు బానెట్‌పై ఎగిరిపడగా కొంతముందుకు వెళ్లాక.. కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు తీవ్రమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ తెలిపారు. శ్రీనివాస్ కుమార్తె తేజ జపాన్ దేశంలో ఉద్యోగం చేస్తోందని, ఆమె అక్కడి నుంచి వచ్చిన తర్వాత మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కుమార్తె పెళ్లి చేయాలనే కోరిక తీరకుండానే..

తన కుమార్తె పెళ్లి చేస్తే తన కష్టాలు తీరిపోతాయని శ్రీనివాస్ ఇటీవల తన స్నేహితులు, బంధువుల వద్ద చెప్పినట్లు తెలిసింది. అయితే ఆయన ఆ కోరిక తీరకుండానే కానరాని లోకాలకు వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు, బంధువులు విలపించారు.